జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గ్రీవెన్స్‌లో ఎఎస్‌పి స్వరూపరాణి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వర్షాల నేపథ్యంలో ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు ఎస్‌పి స్వరూపరాణి సూచించారు. ప్రతి సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని జిల్లా అదనపు ఎస్‌పి స్వరూపరాణి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో ఫిర్యాదుదారులు తమ తమ ఫిర్యాదులను ఎఎస్‌పికి అందించారు. ఈ ఫిర్యాదులపై ఆమె సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే ఫిర్యాదులను పరిష్కరించవలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొన్నిరోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తూ ఉండడంతో నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో జిల్లాలో ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వణుకుతున్న విలీన మండలాలు

గోదావరికి పోటెత్తుతున్న వరద

పునరావాస కేంద్రాలకు తరలుతున్న జనం

ముంపులో 52 వేల ఎకరాలు

రెండు జిల్లాల్లో రైతుల పరిస్థితి దయనీయం

పశ్చిమలో 38,641 ఎకరాలు,

ఏలూరు జిల్లాలో 13,762 ఎకరాలు మునక

2,962 ఎకరాల్లో నీటిలో నానుతున్న నారుమళ్లు

దాదాపు 34 వేల మంది రైతుల పరిస్థితి అగమ్యగోచరం

కుక్కునూరు ఎ-బ్లాక్ నుంచి పునరావాస కేంద్రాలకు తరలుతున్న వరద బాధితులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి వరద ఉధృతికి విలీన మండలాలు వణుకుతున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 49 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం ఉదయానికి 50 అడుగులు దాటనున్నట్లు అంచనా వేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు కాపర్ డ్యామ్ వద్ద 33 మీటర్లకు నీటిమట్టం చేరింది. దీంతో దాదాపు 11 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను వరద నీరు చుట్టుముట్టింది. దీంతో గొమ్ముగూడెం, రాపాకగొమ్మి, కౌండిన్యముక్తి, లచ్చిగూడెం, చాకరపల్లి, కుక్కునూరు ఎ-బ్లాక్ వంటి పలు గ్రామాలకు చెందిన ప్రజలను రావికుంట, కివ్వాక, మర్రిపాడు పునరావాస కాలనీలకు తరలించారు. రుద్రంకోట, కొయిదా వంటి పలు గ్రామాలకు చెందిన ప్రజలు కొండలపైకి చేరుతున్నారు. పునరావాస కేంద్రాలకు చేరిన బాధితులకు నిత్యావసర వస్తువులు, విద్యుత్ సదుపాయం కల్పించడంలో నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొండలపైకి వెళ్లేవారికి టార్పలిన్లు ఇవ్వకపోవడంపై బాధితులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. సోమవారం వర్షం ఆగినప్పటికీ గోదావరి వరద మాత్రం భారీగా పెరుగుతోంది. దీంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలతోపాటు పోలవరం మండల ప్రజలు, డెల్టాలోని ఆచంట, పెనుగొండ, యలమంచిలి, నరసాపురం మండలాల్లోని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ముంపులో 52 వేల ఎకరాలు

భారీవర్షాలు, వరదలకు రెండు జిల్లాల్లోని ప్రజలు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. ముఖ్యంగా అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సోమవారం నాటికి రెండు జిల్లాల్లో 52,411 ఎకరాల్లో నాట్లు నీట మునగ్గా, 2,962 ఎకరాల్లో నారుమడులు ముంపుబారిన పడ్డాయి. పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా 38,641 ఎకరాల్లో నాట్లు, 2,480 ఎకరాల్లో నారుమడులు ముంపుబారిన పడగా, ఏలూరు జిల్లాలో 13,762 ఎకరాల్లో నాట్లు, 482 ఎకరాల్లో నారుమడులు నీటిలో నానుతున్నాయి. పొలాల ముంపు రోజురోజుకీ పెరుగుతోంది. ఎగువన కురిసిన వర్షాలకు నీరు దిగువకు చేరుతుండటంతో డెల్టాలో పంట ముంపు మరింత పెరిగే పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకూ అధికారుల లెక్కల ప్రకారం దాదాపు 34 వేల మంది రైతులకు చెందిన ఆయకట్టు ముంపునకు గురైంది. ఇప్పటికే పొలాలు ముంపుబారిన పడి రోజులు గడిచిపోవడంతో పంట దెబ్బతింటుందని రైతులు చెబుతున్నారు. ప్రతి రైతూ దమ్ము, నాట్లు, నారుమడుల నిమిత్తం ఎకరాకు రూ.పది నుంచి రూ.15 వేలు ఖర్చు పెట్టిన పరిస్థితి ఉంది. దీంతో రైతులకు ఏం చేయాలో అర్థంకాని అయోమయ పరిస్థితి ఏర్పడింది. పొలాల్లో వరద నీరు చేరడంతో కొత్తగా నాట్లు నాటే పరిస్థితీ లేకుండా పోయింది. వరదలకు రైతులు ఖరీఫ్ సీజన్ నష్టపోయే పరిస్థితి ఉంది. కొల్లేరుకు భారీగా వరద నీరు చేరుతుండటంతో కొల్లేరును ఆనుకుని ఉన్న గ్రామాల్లో పంట పొలాలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఏర్పడిందని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకుంటే తప్ప కోలుకునే పరిస్థితి లేకుండా పోయింది..

నిర్మలమ్మ పద్దు పలికేనా..!

నేడు పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్

పోలవరానికి నిధుల కేటాయింపుపై ఉత్కంఠ

పునరావాసానికి నిధులిస్తేనే

నిర్వాసితుల కష్టాలు తీరే

రైల్వేలైన్లకు నిధులు కేటాయించేనా

వ్యవసాయం, ఆక్వాకు

ప్రోత్సాహకాలు ప్రకటిస్తారా

ఆదాయపు పన్ను ఊరట కోసం వేతన జీవుల

ఎదురుచూపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల కన్నీటి వ్యథలు.. వేతన జీవుల ఆదాయపు పన్ను కష్టాలు.. కర్షకుల కన్నీటి వెతలు మోడీ సర్కార్‌కు కన్పిస్తాయా.. మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే కేంద్రబడ్జెట్‌లో అందుకు తగిన విధంగా నిధులు కేటాయించేనా.. అంటూ సర్వత్రా చర్చ సాగుతోంది. జిల్లాలోని రైల్వేలైన్లకు, నిట్, కేంద్రీయ విద్యా సంస్థల అభివృద్ధి వంటి వాటికి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారా.. ఆక్వా, వ్యవసాయ సాగుకు ఊతమిచ్చేలా ప్రకటన ఉంటుందా.. లేదా అనేది నేడు ప్రవేశపెట్టబోయే 2024-25 పూర్తిస్థాయి బడ్జెట్‌తో తేలిపోనుంది.

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై జిల్లా ప్రజానీకం అనేక ఆశలు పెట్టుకుంది. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై ఉత్కంఠ కొనసాగుతోంది. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో టిడిపి, జనసేన ముఖ్యభూమిక పోషిస్తున్నాయి. టిడిపి బలంపైనే కేంద్రం మోడీ సర్కార్ నిలబడింది. ఇటువంటి తరుణంలో ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపు ఏవిధంగా ఉంటుందనే చర్చ జనంలో నెలకొంది. జిల్లాలో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు బాధ్యత కేంద్రానిదే. ఈ ప్రాజెక్టుకు పూర్తిస్థాయి నిధులు కేంద్రమే భరించాల్సి ఉంది. గడిచిన పదేళ్లుగా మోడీ సర్కార్ పోలవరానికి నిధుల కేటాయింపులు సక్రమంగా చేయకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతోంది. దీంతో పోలవరం నిర్వాసితులకు ఇప్పటి వరకూ పునరావాస ప్యాకేజీ అందించలేదు. ఒకపక్క ప్రాజెక్టులో కీలకమైన కాపర్‌డ్యామ్ నిర్మాణం చేయడంతో ప్రతియేటా జులై, ఆగస్టు నెలల్లో విరుచుకుపడుతున్న గోదావరి వరదలకు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 107 నివాసిత ప్రాంతాలకు చెందిన 20 వేలకుపైగా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ప్రస్తుతమూ అదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రాజెక్టుకు రూ.52 వేల కోట్లు ఖర్చవుతుందని, నిర్వాసితులకు పరిహారం కింద రూ.33 వేల కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం తేల్చింది. ఇప్పటి వరకూ నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ ఏమిటి వరకూ కూడా అందించని పరిస్థితి నెలకొంది. బడ్జెట్‌లో పోలవరానికి నిధులు పెద్దఎత్తున కేటాయిస్తేనే నిర్వాసితులకు పరిహారం అందే అవకాశం ఉంటుంది.

రైల్వేలైన్లకు మోక్షం లభించేనా?

జిల్లాలో దశాబ్దాల నాటి కలగా కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్లు ఉన్నాయి. ప్రతియేటా బడ్జెట్‌లో కొవ్వూరు-భద్రాచలం లైనుకు నిధుల కేటాయింపు అనేదే లేకుండాపోయింది. కోటిపల్లి-నరసాపురం రైల్వేలైనుకు అరకొర నిధుల కేటాయింపుతో సరిపెడుతున్న పరిస్థితి ఉంది. జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారో.. లేదో వేచిచూడాలి.

వేతన జీవుల ఎదురుచూపు.. కేంద్రీయ విద్యాసంస్థలకు నిధులు దక్కేనా

ఏడాదికి రూ.2.50 లక్షలుగా ఉన్న ఆదాయపు పన్ను పరిమితిని రూ.ఐదు లక్షలకు పెంచాలని వేతన జీవులు కోరుతున్నారు. ఈ బడ్జెట్ లోనైనా ఊరట లభిస్తుందనే ఆశతో ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని నిట్, కేంద్రీయ విద్యాలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తారో లేదో వేచిచూడాలి. జిల్లాలో అతిపెద్ద సాగుగా ఆక్వా ఉంది. సరైన ధరలేక, మేత ధరలు పెరిగిపోయి ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఆక్వా రైతులకు మేలు చేసేలా బడ్జెట్‌లో ప్రతిపాదనలు ఏమైనా ఉంటాయా అని ఆక్వా రైతు లు ఎదురు చూస్తున్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలు, డీజిల్, పెట్రోల్ ధరలు పెరిగి పోవడంతో వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపో యా యి. దీంతో సాగు భారంగా మారింది. వ్యవసాయ పం టల మద్దతు ధరకు సంబంధించి బడ్జెట్‌లో ప్రస్తావి స్తారో.. లేదో చూడాల్సి ఉంది. ఉపాధి హామీకి నిధుల కేటాయింపుపైనా ఉత్కంఠ నెలకొంది. నిర్మలమ్మ పద్దు ఎవరికి మేలు చేకూర్చనుందో మరికొద్ది గంటల్లో తేలిపోనుంది.

25 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

వరద ప్రభావిత ప్రాంతాలకు బోట్‌లో వెళ్తున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఏజెన్సీలోని వాగులు వంకలు పొంగి ప్రవహించడం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులకు భారీగా చేరిన వరద నీటిని గేట్లు ఎత్తి దిగువకు వదలడంతో గోదావరికి వరద పోటెత్తుతోంది. భద్రాచలంలో సోమవారం సాయంత్రానికి రెండో ప్రమాద హెచ్చరికను దాటి 49 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. ఓవైపు వరద ఉధృతంగా పెరుగుతుండటం, మరోవైపు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ముంపు మండలాల ప్రజలు బయటకు వచ్చే పరిస్థితి లేక బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఆరు రోజుల క్రితం గుండేటి వాగు ఉధృతంగా పొంగడంతో దాచారం-కుక్కునూరు మధ్య గల గుండేటి వాగు కాజ్‌వే కొట్టుకు పోయి గోదావరి వరద ముంచెత్తడంతో దాచారం, నెమలిపేట, సీతారామపురం, అరవపల్లి వంటి 14 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. గోదావరికి వరద పెరగడంతో సోమవారం ముత్యాలంపాడు-వింజరం మధ్య గల పాలవాగుపై కాజ్‌వేపై, సీతారామనగరం-వేలేరు మధ్య ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో 11 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. గోదావరి వరద మండలాన్ని చుట్టుముట్టడంతో మండలంలోని గుమ్ముగూడెం గ్రామానికి చెందిన 253 కుటుంబాలు, లచ్చిగూడెం గ్రామంలోని 40 కుటుంబాలు, వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము గ్రామంలోని 200 కుటుంబాల బాధితులను మండలంలోని రావికుంట గ్రామంలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం నిర్మించిన పునరావాస కాలనీలకు, కౌండిన్యముక్తిలోని 40 కుటుంబాలను మర్రిపాడులోని పునరావాస కాలనీకి, కుక్కునూరు ఎ-బ్లాక్‌లోని కుటుంబాలను కివ్వాక పునరావాస కాలనీకి అధికారులు తరలించారు. భద్రాచలంలో రెండో ప్రమాద హెచ్చరికను సైతం దాటి వరద ఉధృతి కొనసాగుతుండటంతో 1986, 2022లో వచ్చిన వరదలు మళ్లీ వస్తాయా అని విలీన మండలాల ప్రజల్లో తీవ్ర అలజడి నెలకొంది.

పునరావాస కేంద్రాలకు రండి

వరద ప్రభావిత గ్రామాల్లో కలెక్టర్, ఎస్‌పి పర్యటన

గోదావరి వరదల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వరద ముంపు గ్రామాల్లో పర్యటించారు. వరద తీవ్రత దృష్ట్యా సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి విజ్ఞప్తి చేశారు. కుక్కునూరు మండలంలోని కౌడిన్యముక్తి, వేలేరుపాడు మండలంలోని చాకరపల్లి గ్రామాలలోని ప్రజల ఇళ్లకు వెళ్లి వరద సహాయక కేంద్రాలకు రావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. గోదావరి వరద మరింత పెరిగితే ప్రమాదమని, వరద తగ్గేంతవరకు పునరావాస కేంద్రాల్లో ఉండాలని ప్రజలను కోరారు. కలెక్టర్ విజ్ఞప్తి మేరకు అంగీకరించిన కుక్కునూరు మండలంలోని కౌడిన్యముక్తి గ్రామ ప్రజలను అధికారులు మాధవరం గ్రామపంచాయతీలోని మర్రిపాడు ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి తరలించారు. వేలేరుపాడు మండలం చాకరపల్లి గ్రామాన్ని సందర్శించి కలెక్టర్ చేసిన విజ్ఞప్తికి ప్రజలు స్పందించారు. చాకరపల్లి గ్రామంలోని ప్రజలను అధికారులు దాచారంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి తరలించారు. అనంతరం వేలేరుపాడు మండలం కన్నయ్యగుట్ట అంగన్వాడీ కేంద్రంలో నిత్యావసర వస్తువుల స్టాక్ పాయింట్‌ను కలెక్టర్, ఎస్‌పి పరిశీలించారు. వరద కారణంగా రహదారి సౌకర్యం లేని గ్రామాలకు మూడు రోజులకు సరిపడా ఐదు కిలోల బియ్యం, అరకేజీ కందిపప్పు, అరకేజీ వంటనూనె, టమాటా, ఉల్లిపాయలు, మిర్చి, బంగాళాదుంపలు, తదితర కూరగాయలు కేజీ చొప్పున నిత్యావసర సరుకులను, ప్రతి ఇంటికీ వాటర్ పాకెట్ల బస్తా చొప్పున ఇంటింటికీ సిబ్బంది అందించారన్నారు. కలెక్టర్ వెంట డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాధ్, డిఎస్‌ఒ ఆర్.సత్యనారాయణరాజు, జిల్లా పౌర సరఫరాల సంస్థ డిఎం మంజుభార్గవి, తహశీల్దార్ చిన్నారావు ఉన్నారు.

వైద్య శిబిరాన్ని సందర్శించిన జాయింట్ కలెక్టర్

వరద ప్రభావిత ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించేందుకు పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని పునరావాస కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించారు. శిబిరంలో అందిస్తున్న సేవలను ఆరా తీసి మందులను పరిశీలించారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారికి అంబులెన్స్‌లో సమీప పిహెచ్‌సి లేదా జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించాలని సూచించారు.

వైద్య శిబిరంలో మందులు పరిశీలిస్తున్న జెసి లావణ్యవేణి

కుక్కునూరు మండలంలో గ్రామాలను చుట్టుముట్టిన వరద

దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాట్లపై బాధితుల సంతృప్తి

దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ సందర్శించారు. పునరావాస కేంద్రంలో సదుపాయాలపై కలెక్టర్ ఆరాతీశారు. దీనిపై గొమ్ముగూడేనికి చెందిన వృద్ధుడు డి.సత్యం మాట్లాడుతూ పునరావాస కేంద్రంలో సదుపాయాలు బాగున్నాయన్నారు. అధికారులు తమను కంటికి రెప్పలా చూసుకుంటున్నారని కలెక్టర్‌కు తెలిపారు. 1986లో గోదావరి వరదల సమయంలో మీరున్నారా అని కలెక్టర్ ప్రశ్నించగా అప్పటి నుండి ఇక్కడే ఉన్నామని తెలపగా గోదావరి వరదలకు సంబంధించి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. కోటగిరి నవీన్ మాట్లాడుతూ గోదావరి వరద హెచ్చరికల ముందునుంచే అధికారులు అందరినీ అప్రమత్తం చేయడం ఎంతో ఉపయోగపడిందని చెప్పారు. రాత్రి 12 గంటల వరకు తమను అంటిపెట్టుకునే ఉంటున్నారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పశువులకు అవసరమైన దాణా కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పోలవరం: గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి పోలవరంలో గోదావరి నీటిమట్టం 24.710 మీటర్లకు చేరుకుంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులైన శబరి, మంజీర, ప్రవర, పర్ణ, ప్రాణహిత, ఇంద్రావతి, కిన్నెరసాని, మానేరు గోదావరి నదిలోకి కలుస్తున్న వరద జలాలను స్పిల్‌వే నుండి ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న 10,95,616 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు ఇఇ మల్లిఖార్జునరావు, డిఇ మాధవరావు తెలిపారు. ఎగువ ప్రాంతాల నుండి అదనపు జలాలు వస్తుండడంతో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధం

కలెక్టర్ వెట్రిసెల్వి

కుక్కునూరు : దాచారం పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

జిల్లాలో వరద పరిస్థితి పూర్తి అదుపులో ఉందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించిన అనంతరం దాచారంలో వరదల నష్ట నివారణపై జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను మీడియాకు ఆమె వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వరద కారణంగా ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ఐదు కేంద్ర, రాష్ట్ర విపత్తు నివారణ బృందాలు, 12 బోట్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా వివిధ ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగార్థం హెలికాప్టర్లు రాజమండ్రిలో సిద్ధంగా ఉన్నాయన్నారు. వరద నీటిలో ముంపునకు గురైన గ్రామాలు, వరదల కారణంగా రహదారి సౌకర్యం దెబ్బతిన్న గ్రామాలను బోట్ల ద్వారా వెళ్లి పరిశీలించి, అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నామన్నారు. పెదవాగు వరద ముంపు పరిస్థితి తీవ్రత ప్రస్తుతం లేదని, వరద నీరు తగ్గుతూ ఉందన్నారు. వరద సహాయక కేంద్రాలలో కూడా బాధితులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం వరదల నష్ట నివారణకు ముందస్తుగా తీసుకున్న చర్యల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగలేదన్నారు. మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. వరదల సమయంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు సమాచార వ్యవస్థకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

మురుగుకాలువలు, బోదెల్లో తూడు తొలగించాలి

డ్రెయిన్లను పరిశీలించిన ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ

ఉంగుటూరు :భారీ వర్షాలకు ఉంగుటూరు మండలంలో వేలాది ఎకరాల్లో పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ముంపు పొలాలను ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ సోమవారం పరిశీలించారు. కైకరం, నాచుగుంట, వెల్లమిల్లి, బాదంపూడి, రాచూరు తదితర ప్రాంతాల్లో చెరువులను తలపిస్తున్న వరి పొలాలను పరిశీలించారు. వరద నీరు దిగువకు వెళ్లే నాచుగుంట క్వారీ మురుగు బోదె, కైకరంలో గుర్రాల వాగు మార్గాలు ఆక్రమణలకు గురికావడం, డ్రెయిన్ల మరమ్మతులు, నిర్వహణ గత పాలకులు పట్టించుకోకపోవడం వల్లే పంట నష్టం భారీగా ఉందని రైతులు అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన డ్రెయిన్లు, బోదెల్లో పూడికలు తీయించాలని ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధికారు లను ఆర్‌డిఒ ఆదేశించారు.

అడ్మిషన్ ధ్రువపత్రం అందుకుంటున్న విద్యార్థిని

లిఖితకు ట్రిపుల్ ఐటీలో సీటు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విద్యార్థినికి నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్ అడ్మిషన్ ధ్రువపత్రాన్ని అందించారు. తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం కొత్త వేపకుప్పానికి చెందిన లిఖిత పదో తరగతిలో 597 మార్కులు సాధించింది. ఆ విద్యార్థిని నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు కావాలని దరఖాస్తు కోరడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్ ఇచ్చారు. ఆమె అన్నమయ్య జిల్లా కలకడ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివింది.

నూజివీడు ఆర్‌జియుకెటిలో జనరల్ కౌన్సెలింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జనరల్ కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. సోమవారం 515 మందిని పిలువగా 436 మంది ఆర్‌జియుకెజి నూజివీడు క్యాంపస్‌కు ప్రవేశాలు పొందారు. కౌన్సెలింగ్‌లో భాగంగా రిజిస్ట్రేషన్ కౌంటర్లు రెండు, అకాడమిక్ వెరిఫికేషన్ కౌంటర్లు నాలుగు, ఫీ కౌంటర్లు మూడు, డేటా ఎంట్రీ కౌంటర్లు ఏడు, సర్టిఫికెట్ కలెక్షన్ కౌంటర్లు నాలుగు, ఐడి కార్డ్ ఇష్యు కౌంటర్లు మూడు ఏర్పాటు చేసినట్లు అడ్మిషన్స్ కన్వీనర్ ఆచార్య అమరేంద్రకుమార్ తెలిపారు.

గిరిజనులపై భూస్వాముల దాడి అమానుషం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ ఖండన

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - టి.నరసాపురం



మాట్లాడుతున్న రామకృష్ణ

గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను భూస్వాములకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్న రెవెన్యూ శాఖాధికారులుపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గిరిజనులపై దాడులను నిరసిస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ స్థానిక భూస్వాములు ఇచ్చే లంచాలు తీసుకుని రెవెన్యూ శాఖాధికారులు రికార్డులను తారుమారు చేస్తున్నారన్నారు. చట్టప్రకారం భూమి లేని పేదలకు భూమి ఇవ్వాల్సిన అధికారులు భూస్వాములకు కట్టబెట్టాలని రెవెన్యూ అధికారులు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక విఆర్‌ఒ రికార్డులను తారుమారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విఆర్‌ఒపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ డిప్యూటీ తహశీల్దార్ రాధాకృష్ణ భూస్వాములు ఇచ్చే లంచాలు తీసుకుని స్థానికేతరులకు ఈ భూములు కట్టబెట్టాలని రికార్డులను మార్చి రాస్తున్నారన్నారు. 2010 నుంచి గిరిజనులు, దళితులు, పేదలు కృష్ణాపురం మెట్ట సర్వే నెంబర్ 86లో 89 ఎకరాల 80 సెంట్ల భూమిని సాగు చేస్తూ భూమిలో పత్తి, బొబ్బర్లు, మినుములు, జీడిమామిడి మొక్కలు వేసి సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రతిపక్ష పార్టీ మండల నాయకులు, కొంతమంది భూస్వాములు ఈ భూములపై కన్నేసి బినామీలను దింపి ఇక్కడున్న గిరిజనులు, దళితులపై దాడి చేసి దౌర్జన్యం చేసి వారి భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అయినా రెవెన్యూ శాఖాధికారులు పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. భూముల విషయంలో వెనకాల ఉన్న అసలు రహస్యం ఏమిటో తెలపాలని కోరారు. గిరిజన మహిళలపై దాడి చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్థానిక గిరిజనులకు, దళితులకు భూస్వాముల నుంచి రక్షణ కల్పించాలని, భూములు సాగు చేసుకునే విధంగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టు, డివిజనల్ రెవెన్యూ కోర్టు ఇచ్చిన ఆదేశాలను మండల రెవెన్యూ శాఖాధికారులు అమలు చేయకపోవడం వల్లే ఈ నష్టం జరిగిందన్నారు. అధికారులు భూస్వాములు ఇచ్చే లంచాలు మింగి పేదలకు నష్టం చేయాలని చూస్తే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు మడకం సుధారాణి, ఎ.మురళి, మండల నాయకులు కుమారి, ముత్తమ్మ, లక్ష్మి చినలక్ష్మడు పాల్గొన్నారు.

నూజివీడు వాసుల సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

నూజివీడు పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నూజివీడు మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డికి, ఛైర్మన్ త్రివేణిదుర్గకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎంప్లాయీస్ కాలనీ, కోనేరుపేట, హాజరయ్యపేట, బంగినపల్లి తోట, పలు ఏరియాల్లో కోతులు గుంపులు గుంపులుగా స్థానికుల ఇళ్లల్లోకి వచ్చి దాడి చేస్తున్నాయని చెప్పారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తూ దాడి చేస్తున్నాయన్నారు. కోతుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నూజివీడు పట్టణంలో అన్ని వార్డుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా రోడ్డు మీదకు వచ్చి రోడ్డుపై వెళ్లేవారిపై దాడి చేస్తూ ఎంతో భయాందోళనకు గురి చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే చిన్నారులపై దాడి చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయన్నారు. అలాగే పట్టణంలో పలు రహదారుల్లో ఆవులు పదుల సంఖ్యలో ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. అంతేకాకుండా రోడ్లను అపరిశుభ్రత చేస్తున్నాయన్నారు. పట్టణంలోని వార్డుల్లో ఇళ్ల మధ్య ఖాళీగా ఉన్న స్థలాల్లో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి మురికి నీరు నిల్వ ఉండటంతో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్, సిపిఎం నాయకులు దుర్గారావు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో హీల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



విద్యార్థులను అభినందిస్తున్న హీల్ యాజమాన్యం

జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో ఉన్న హీల్ అంధ పాఠశాల విద్యార్థులు రజిత, కాంస్య పతకాలు సాధించినట్లు హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు కోనేరు సత్యప్రసాద్ తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి 17 వరకు బెంగుళూరు కంఠీరవ స్టేడియంలో జాతీయ స్థాయిలో జరిగిన 13వ జాతీయ జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీల్లో హీల్ అంధ పాఠశాలకు చెందిన జాలా వరలక్ష్మి లాంగ్‌జంప్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించి రజిత పతకం పొందింది. 1500 మీటర్ల పరుగు పందెంలో కె.సునీల్ తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం పొందాడు. సిహెచ్.ప్రవీణ్ ఐదో స్థానంలో నిలిచాడు. పతకాలు సాధించిన అంధ విద్యార్థులను హీల్ ఇండియా అధ్యక్షులు రామావతార్ యాదవ్(ఎపి మాజీ డిజిపి), కార్యదర్శి తాతినేని లక్ష్మి, సిఇఒ కూరపాటి అజయ్‌కుమార్, ప్రిన్సిపల్ బి.సాయిబాబు, అంధ పాఠశాల చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సుఖవాసి, రుష్మంత్ ఫిజికల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్లు ఎస్.నాగరాజు, సిహెచ్.ప్రభుదాసు, అథ్లెటిక్ కోచ్ ఎ.శ్రీనివాసరెడ్డి అభినందించారు.

బిల్లులు కట్టాలని ఎస్‌టి ఎస్‌టిలపై ఒత్తిడి తగదు

కెవిపిఎస్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఎస్‌సి, ఎస్‌టి లకు ఉచితంగా ఇస్తున్న కరెంట్ 200 యూనిట్ల నుంచి 300 యూనిట్లకు పెంచాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ కోరారు. 2019లో అప్పటి వైసిపి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇవ్వాలని జిఒ విడుదల చేసిందని చెప్పారు. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక పాత బకాయిల పేరులో బిల్లులు కట్టాలని ఎస్‌సి ఎస్‌టిలపై అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. ఈ మేరకు మండలంలోని రెడ్డి గణపవరం ఎస్‌సి కాలనీలో కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ బిల్లులు కట్టాలని ఎస్‌సి ఎస్‌టిలపై అధికారులు ఒత్తిడి చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం 200 నుంచి 300 యూనిట్లకు పెంచాలని కోరారు. లేకపోతే దళిత, గిరిజన, ప్రజాసంఘాలను ఐక్యం చేసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి గణపవరం మూడో వార్డు మెంబర్ కె.ఝాన్సీ, పి.రాధమ్మ, ఎన్.సీతమ్మ, పుష్పమ్మ, డి.వెంకటేశ్వరరావు, కె.దుర్గారావు, బి.శివ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్

సొంత ఖర్చుతో డంపింగ్ యార్డ్ శుభ్రత పనులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

టిడిపి నాయకుడు ఎంఎస్ఆర్ ట్రస్ట్ స్థాపకులు మొగతడకల శ్రీనివాసరావు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు మొగతడకల లక్ష్మీరమణి తనయుడు యువ నాయకుడు మొగతడకల ఓం ప్రకాష్‌చౌదరి సొంత ఖర్చులతో డంపింగ్ యార్డు శుభ్రత పనులు చేయించారు. డంపింగ్ యార్డు చెత్తా చెదరంతో పేరుకుపోయి రోడ్డు మీదకు చెత్త రావడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది గమనించిన ఓంప్రకాష్‌చౌదరి తన సొంత ఖర్చులతో జెసిబి సాయంతో డంపింగ్ యార్డ్ శుభ్రతా పనులు చేయించారు. గ్రామస్తులకు ఏ అవసరమొచ్చినా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. గ్రామస్తులు ఓంప్రకాష్‌చౌదరిని అభినందించారు.

'మీటర్ రీడర్లకు న్యాయం చేయాలి'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్ల సంఘం పశ్చిమగోదావరి జిల్లా సమావేశం కె.శివారెడ్డి అధ్యక్షతన స్థానిక స్ఫూర్తి భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీటర్ రీడర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం మీటర్ రీడర్లను చాలా అన్యాయానికి గురి చేసిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం మీటర్ రీడర్లకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివారెడ్డి మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లాలో మీటర్ రీడర్స్‌కు పిస్ రేట్ సక్రమంగా కాంట్రాక్టర్లు చెల్లించటంలేదన్నారు. మీటర్ రీడర్ల జీతాలు స్కానింగ్ అవ్వలేదని, సాకులు చెప్పి యాజమాన్యం కూడా జీతాల్లో కోతలు విధుస్తున్నారన్నారు. శ్రీనివాస్ డాంగే మాట్లాడుతూ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మీటర్ రిడర్స్ సంఘానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి ఏలూరు జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ వెంకటరాజును కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - దెందులూరు

గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజును ఆయన నివాసంలో టిడిపి దెందులూరు మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, తెలుగు యువత సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వెంకటరాజును నారాయణ ప్రసాద్, మోత్కూరి నాని పూలదండ, బొకే, శాలువాతో ఘనంగా సత్కరించారు.

శ్రీ మేధా దక్షిణ మూర్తికి వెండి తొడుగు

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని చల్ల చింతలపూడి గ్రామంలో ఉన్న శ్రీ మేధా దక్షిణామూర్తి స్వామికి దాత రూ.1.50 లక్షల విలువైన కేజీన్నర వెండి తొడుగులు వేద పండితులు, ప్రధాన అర్చకులు ప్రసాద్‌కు దాత దామరాజు రామమూర్తి, పసుమర్తి శ్రీలక్ష్మి కృష్ణ ప్రసాద్‌లు అందించారు. 106 సంవత్సరాల క్రితం చల్ల చింతలపూడి గ్రామంలో వేగిరాజులతో కలిసి దామరాజు సుబ్రహ్మణ్య దీక్షితులు శ్రీ మేధా దక్షిణామూర్తి స్వామి వారి ఆలయానికి శంకుస్థాపన చేశారు. ఆయన ప్రథమ కుమారుడు వెంకటరామసూరి వారి ఐదో కుమారుడు దామరాజు రామమూర్తి, కుమార్తె పసుమర్తి శ్రీలక్ష్మి కృష్ణ ప్రసాద్‌లు వెండి తొడుగులు చేయించి అందించారు.

నేరాలు - ఘోరాలు

ఆలయంలో హుండీ చోరీ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల మెయిన్ బజార్‌లో ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో హుండీ చోరీకి గురైంది. ఆదివారం రాత్రి దొంగలు హుండీని చోరీ సుమారు రూ.40 వేలు అపహరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోలీసులు ఆలయాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగితే సమాచారం ఇవ్వాలని ద్వారకాతిరుమల ఎస్ఐ సతీష్ తెలిపారు.

వ్యాన్ ఢీకొని గేదె మృతి

మండవల్లి :వ్యాను ఢీ కొట్టిన సంఘటనలో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని పులపర్రు వద్ద సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ధర్మకోల్ లోడు వ్యాను ఏలూరు నుంచి కైకలూరు వెళ్తుండగా పులపర్రు వద్దకు వచ్చేసరికి గేదె అడ్డు వచ్చింది. వ్యాన్ డ్రైవర్ తప్పించేందుకు ప్రయత్నించే క్రమంలో గేదెను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ కింద ఇరుక్కుపోయిన గేదె మృతి చెందింది. గేదెను బయటకు తీసేందుకు ప్రయత్నించిన కుదరకపోవడంతో క్రేన్ సహాయంతో వ్యాన్ పైకి లేపి మృతి చెందిన గేదెను పక్కకు తొలగించారు. రూ.లక్షల విలువ చేసే గేద మృతి చెందడంతో యజమాని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న లారీ పట్టివేత

ఏలూరు స్పోర్ట్స్ :పెదపాడు మండలంలోని తోటగూడెం సమీపంలో కోడి వ్యర్థాలను తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పెదపాడు ఎస్ఐ శుభశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం...కొంతకాలంగా పెదపాడు పరిసర ప్రాంతాల్లో కోడి వ్యర్థాలను చేపల చెరువులకు వినియోగిస్తున్నారు. దీనిపై నిఘా పెట్టిన పెదపాడు పోలీసులు సోమవారం ఉదయం పెదపాడు మండలం తోటగూడెం సమీపంలో కోడి వ్యర్థాలతో వెళ్తున్న లారీని పట్టుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అంతా అపారిశుధ్యం... ఆపై నిర్లక్ష్యం..!

ఎక్కడపడితే అక్కడే చెత్తాచెదారం
అధ్వానంగా డ్రైయినేజీ వ్యవస్థ
విజృంభిస్తున్న దోమలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముసునూరు

రోడ్డుపై వర్షపు నీరు

మండలంలోని 16 గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు వ్యాపించి రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. వారు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగు పరిచి తమను ఇబ్బందుల నుంచి బయట పడేయాలని, రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలో కాఫీ హోటల్స్, కూరగాయలు, మాంసం దుకాణాల నిర్వాహకులు ఇలా పలు వ్యాపారులు వ్యర్థాలను రోడ్ల పక్కనే పడేస్తున్నారు. దీంతో వ్యర్థాలు, చెత్త రోడ్డు పక్కనే పేరుకుపోయిన స్థానికులు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు వ్యాప్తి చెందడంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా అంటు వ్యాధి వచ్చినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. మండల కేంద్రమైన ముసునూరులో డయేరియా, డెంగీ వంటి వ్యాధులు రావడంతో పాటు, ప్రజలు జ్వరాల బారిన పడ్డారు. ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది కూడా జ్వరాల పడిన పడ్డారు. మండల కేంద్రమైన ప్రభుత్వ కార్యాలయాల చుట్టుపక్కల, పరిసర ప్రాంతాల్లోనే చెత్తాచెదారం దర్శమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని 16 గ్రామాల్లో కూడా అదే పరిస్థితి ఉన్నా కనీసం స్పందించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సచివాలయాలవద్ద, ప్రభుత్వ భవనాల వద్ద అపరిశుభ్రత వాతావరణం కనిపిస్తుందని మండల ప్రజలు వాపోతున్నారు. తహశీల్దార్, ఎంపిడిఒ, ఎస్ఐ, వైద్యులు కలిసి టీమ్‌గా ఏర్పడి రోజుకోక గ్రామంలో పర్యటించి రోడ్లపై చెత్తచెదారం వేసినవారిపై చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని మండల కోరుతున్నారు. ఆయా గ్రామాల్లో సర్పంచి, పంచాయతీ కార్యదర్శులు కూడా పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. రోడ్లపై చెత్త, పెంటకుప్పలు తొలగించాలని కోరుతున్నారు. అపారిశుధ్యంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థ కూడా అంతంతమాత్రంగానే ఉంది. చిన్న వర్షం కురిసినా రోడ్లపై నీరు నిలిచిపోతుంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంతో సహా అన్ని గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఆయా సిబ్బంది తూతూమంత్రంగా పని చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. సిబ్బందితో పూర్తి స్థాయిలో పనులు చేయించే పరిస్థితి పాలకుల్లో, అధికారుల్లో కనిపించడంలేదని ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా గ్రామాల్లో పరిస్థితి మారడంలేదని, ఆ మేరకు ఎవరూ చర్యలు తీసుకోవడంలేదని మండల వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మండలంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుని, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా ఉండేలా చూసి తమకు ఇబ్బందులు లేకుండా, రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

గుర్రపు డెక్క తొలగించిన అనంతరం కాలువ

గుర్రపు డెక్క తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సిబి కెనాల్‌లో తాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన గుర్రపు డెక్కను ఎట్టకేలకు అధికారులు స్పందించి సోమవారం తొలగించారు. నీటి ప్రవాహానికి అడ్డంకిగా గుర్రపు డెక్క శీర్షికతో ఈ నెల 19వ తేదీ శుక్రవారం ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ వార్తపై స్పందించిన జల వనరుల శాఖాధికారులు సిబి కెనాల్ పరిధిలోని కొరగుంటపాలెం, గోకినంపాడు గ్రామాల్లో కాలిబాట వంతెనల వద్ద కానాలకు దట్టంగా పట్టిన గుర్రపు డెక్కను కూలీలతో తొలగింపచేశారు.

ఉద్యోగోన్నతి డ్రైవర్లకు వేతనాలు, ఇంక్రిమెట్లు ఇవ్వాలి

ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరపాలక సంస్థలో ఉద్యోగోన్నతి పొందిన డ్రైవర్లు తొమ్మిది మందికి రెండేళ్లకు పైగా ఉద్యోగోన్నతి వేతనం, ఇంక్రిమెంట్లు, హడాక్ ఇంక్రిమెంట్లు ఇవ్వటం లేదని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు అన్నారు. తొమ్మిది మంది డ్రైవర్లకు పెరిగిన వేతనాలు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరుతూ సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఎఐటియుసి అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేసి అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తొమ్మిది మంది డ్రైవర్లకు ఉద్యోగోన్నతి వేతనాలు, ఇంక్రిమెంట్లు ఇవ్వడంలో హెల్త్ సెక్షన్ సూపరింటెండెంట్, ఇంజినీరింగ్ సెక్షన్ డిఇ తాతబ్బాయి నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తక్షణమే కమిషనర్ జోక్యం చేసుకొని తొమ్మిది మంది డ్రైవర్లకు ఉద్యోగోన్నతి వేతనాలు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, లేకపోతే ఎంఎల్ఎ, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇ జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి సంక్రాంతి పండుగ సందర్భంగా బోనస్ ప్రకటించిందని, ఏలూరు కార్పొరేషన్‌లో పబ్లిక్ హెల్త్ అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి బోనస్ చెల్లించారని, ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి చెల్లించలేదని, వారికి కూడా తక్షణమే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.నాగేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, ఎస్ఎంవి.సుబ్బారావు, డ్రైవర్లు మెరుగు గోవిందు, గోరాకుల దుర్గారావు, గాడి అప్పారావు, అంతర్వేది శేఖర్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - కామవరపుకోట

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తడికలపూడి ఎస్ఐ జయబాబు అన్నారు. సోమవారం సాయంత్రం తడికలపూడి సెంటర్ లో పలు వాహనాలను ఆయన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.

నేటి నుంచి ఆధార్ నమోదు క్యాంపులు

ప్రజాశక్తి - చాట్రాయి

ఆధార్ అప్‌డేట్, ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నూతన ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు గ్రామ సచివాలయంలో జరుగుతుందని ఎంపిడిఒ మంగాకుమారి తెలిపారు. 23వ తేదీ చాట్రాయి గ్రామ సచివాలయంలో, 24న పోలవరం, చిన్నంపేట, నరసింహరావుపాలెం గ్రామ సచివాలయాల్లో, 25న కొత్తగూడెం, చిత్తపూరు, తుమ్మగూడెం గ్రామ సచివాలయాల్లో, 27న జనార్ధనవరం, చిత్తపూరు, కోటపాడు సచివాలయాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

అనారోగ్య బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ఆనందంగా ఉందని యువ భారత్ శక్తి ఫౌండేషన్ ఇన్‌ఛార్జి సాయికుమార్ అన్నారు. యువ భారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని యండపల్లి గ్రామానికి చెందిన అడవికోట్ల దమన్ కొన్ని రోజులుగా కామెర్లు, గాల్‌బ్లాడర్, సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్నాడు. దమన్ చికిత్స నిమిత్తం అందరి సహాయ సహకారాలతో సోషల్ మీడియా ద్వారా రూ.22,500 సహాయం చేసినట్లు సాయికుమార్ చెప్పారు. మదన్ తండ్రి రవీంద్ర కుమార్‌కు రూ.22,500 అందించినట్లు చెప్పారు.

సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల ఇబ్బందులు

ఆన్‌లైన్ వెబ్‌సైట్ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి

డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

వివిధ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెబ్‌సైట్ ఆన్‌లైన్ సేవలను ప్రభుత్వమే కొనసాగించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. కుల ధ్రువీకరణ, ఇన్‌కమ్ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, వారు తల్లిదండ్రులు మీసేవ కేంద్రాల వద్ద అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులకు అడ్మిషన్లు జరుగుతున్న క్రమంలో కుల ధ్రువీకరణ పత్రం, ఇన్‌కమ్ సర్టిఫికెట్ లేక అడ్మిషన్ అయ్యేందుకు వీలు పడకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని, అసంతృప్తిని ఎదుర్కొంటున్నారన్నారు. నిరంతరం ఈ పత్రాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఆన్‌లైన్‌లో నిలుపుదల చేసిందని, దీంతో ప్రజలు మీసేవ కేంద్రాలకు అన్ని రకాల సర్టిఫికెట్ల కోసం రోజుల తరబడి తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి కుల ధ్రువీకరణ, ఇన్‌కమ్ సర్టిఫికెట్ల అన్ని రకాల సేవలు గల ఆన్‌లైన్ వెబ్‌సైట్ తక్షణమే కొనసాగించాలని కోరారు.

తమ్మిలేరు రిజర్వాయర్ పరిశీలన

తమ్మిలేరును పరిశీలిస్తున్న తహశీల్దార్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయర్‌ను చింతలపూడి తహశీల్దార్ వివివి.గోపాలకృష్ణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ్మిలేరు రిజర్వాయర్ చూసేందుకు వచ్చే పర్యాటకులు ఫొటోల కోసం రిస్కులు చేసి ప్రమాదాలకు గురికావొద్దని చెప్పారు. చిన్నపిల్లల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. సాధ్యమైనంతవరకు చిన్న పిల్లలను తీసుకురావొద్దని కోరారు. అనంతరం తమ్మిలేరు రిజర్వాయర్ ఎఇ ఇ పరమానందాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ్మిలేరులోకి సోమవారం మధ్యాహ్నానికి కాచ్‌మెంట్ ఏరియాలో వర్షం, ఎగువ నుంచి వస్తున్న వరద 1800 క్యూసెక్కులుగా ఉన్నట్లు ఎఇఇ పరమానందం తెలిపారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 355 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం తమ్మిలేరు బేసిన్ 347.39 అడుగులు, గొనెల వాగు బేసిన్ 347.13 అడుగులు ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం మూడు టిఎంసిలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 1.720 టిఎంసిలుగా ఉందని పరమానందం తెలిపారు.

ముంపు పొలాల్లో నీటిని తొలగించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో కురుస్తున్న వర్షాలకు 62 ఎకరాల్లో పంట నష్టాలు జరిగినట్లు మండల వ్యవసాయాధికారి బి.సుమలత తెలిపారు. మండలంలో ముంపునకు గురైన పొలాలను వ్యవసాయశాఖ బృందం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ మండలంలో 55 ఎకరాల్లో వరి, ఏడు ఎకరాల్లో మొక్కజొన్న పంటలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. ఎవరికైనా పంట నష్టాలు ఉంటే రైతులు వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నారుమడి దశలో ముంపునకు గురైన ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చల్లాలని సూచించారు. ముంపునకు గురైన వరి పొలాల్లో ఉన్న అధిక నీరు బయటకు తీసి వేయాలన్నారు. పైపాటుగా ఒక ఎకరానికి 20 కిలోల యూరియా, పది కిలోల పొటాష్ ఎరువులు బూస్టర్ డోస్‌గా వేసుకోవాలన్నారు. నీరు పూర్తిగా తీయలేని పక్షంలో రెండు శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేస్తే పైరు త్వరగా పుంజుకుంటుందన్నారు. తెగుళ్ల సోకకుండా కార్బండిజమ్ ఒక గ్రాము లేదా మాంకోజెబ్ రెండు గ్రాముల మందు ఒక లీటరు నీటికి పిచికారీ చేయాలని సూచించారు.

బుట్టాయగూడెం :మండల పరిధిలో నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు కోయ రాజమండ్రి, నూతిరామన్నపాలెం, అచ్చయ్యపాలెం, లక్ష్మడుగూడెం, పలు గ్రామాల్లో పొలాలను సోమవారం పరిశీలించారు. వర్షాలకు 55 ఎకరాల వరి నారుమళ్లు, 75 ఎకరాల నాట్లు వేసిన వరి, 35 ఎకరాల వరి, ప్రత్తి పంట నీట మునిగినట్లు తెలిపారు. రైతులు అధైర్యపడొద్దని, పొలాల్లో ఉన్న నీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు.

ముదినేపల్లి :వివిధ దశలో ఉన్న వరిలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండవల్లి వ్యవసాయ సహాయ సంచాలకురాలు జి.వెంకటమణి అన్నారు. మండలంలోని బొమ్మినంపాడు, అల్లూరు, కొరగుంటపాలెం గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను సోమవారం ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం నారుమడి దశలో, విత్తనాలు వెదజల్లిన పొలాలు మొలక దశ నుంచి మొక్క దశలో ఉన్నాయన్నారు. పొలాల్లో నీరు నిలబడకుండా మురుగు కాలవలను శుభ్రం చేసుకోవాలన్నారు. పిలకల దశలోని వరి పంట మునిగితే నీరు బయటకు పోయిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, మరో 20 కిలోల పొటాష్ ఆదనంగా వేసుకోవాలని సూచించారు.

దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన అవసరం

పిహెచ్‌సి వైద్యాధికారి నీలిమ

ప్రజాశక్తి - దెందులూరు

దోమ కాటు అత్యంత ప్రమాదకరమైందని, దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జలా పహారేశ్వరి కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నీలిమ సూచించారు. స్థానిక ఏలూరు వెంకన్నచెరువు, దక్షిణపువీధిలో సోమవారం నిర్వహించిన డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దోమ చిన్న కీటకమైనప్పటికీ దాని ద్వారా ప్రమాదకరమైన అంటువ్యాధులు, డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా సంక్రమిస్తాయన్నారు. విద్యార్థులు దోమకాటుపై అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత ఆచరించాలని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వల్ల డయేరియా, విరేచనాలు, కామెర్లు, టైఫాయిడ్, నులిపురుగు తదిరత వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత ఆచరించాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ మనకు ఎక్కువగా హాని చేసే మలేరియా, డెంగీ దోమలు మన గృహాలు, గృహ పరిసరాల్లో ఉండే మంచి నీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. వారానికి ఒకసారి మంచి నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రజలు దోమల నిర్మూలన సామాజిక బాధ్యతగా భావించాలని తెలిపారు. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హైమావతి, హెల్త్ అసిస్టెంట్స్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితేనే ఉద్యోగాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రణాళికాబద్ధంగా చదివి ప్రతిఒక్కరూ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలని బంజారా బజరంగీ భేరి సంఘం ప్రధాన కార్యదర్శి భుక్య వేణుగోపాల్ నాయక్ అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో ఉపాధ్యాయ వృత్తి కోసం పోటీ పడుతూ డిఎస్‌సి కోసం ప్రిపేర్ అవుతున్న 30 మంది అభ్యర్థులకు బంజారా బజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో సోమవారం మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు అన్ని రకాల సబ్జెక్టు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ నాయక్ మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చే ఆయుధం విద్య అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలబడాలంటే పట్టు వదలకుండా నిరంతర ప్రణాళికాబద్ధమైన శ్రమ ద్వారా మాత్రమే ఉత్తమ ఫలితాలు సాధ్యమన్నారు. కష్టపడటంతో పాటు ఇష్టపడి చదువును చదివిన వారే విజయం సాధిస్తారన్నారు. సంఘ జిల్లా నాయకులు జరభల కృష్ణప్రసాద్ నాయక్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందన్నారు. ఒక దేశం భవిష్యత్తు ఉపాధ్యాయుని చేతుల్లోనే ఉంటుందన్నారు. కష్టపడి చదివి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్యా బిగనాథం, భూక్యా శ్రీనివాస్, ధరావత్ రవి, చంటి నాయక్, ధరావత్ బంగారయ్య, హసావత్ రవీంద్ర, తేజావత్ రామకృష్ణ, భూక్యా రామకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

వరద విపత్తులో సురక్షిత ప్రసవం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

వర్షాలు, వరదల కారణంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 28 మంది గర్భిణులను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. ఆదివారం కుక్కునూరు మండలం చీపురుగూడేనికి చెందిన సోదెం అనిత, పుల్లపగూడేనికి చెందిన బి.అరుణ, సోమవారం చీపురుగూడేనికి చెందిన మడకం దేవమ్మ పండంటి బిడ్డలకు జన్మనిచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో గర్భిణులను గుర్తించి వారిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించడంలో జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కష్టకాలంలో అండగా నిలిచిన ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి ఆయా కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి.

అంబుల వైష్ణవికి చలసాని అభినందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

అమరావతి బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా కార్యక్రమాలు, పేదవారికి, చిన్నపిల్లల చదువుకు, చనిపోయిన పేద వారి దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం చేసిన అంబుల వైష్ణవిని రాష్ట్ర రైతు కార్యదర్శి చలసాని జగన్మోహన్‌రావు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. అతి చిన్న వయసులోనే రెండోసారి కూడా అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నందుకు సంతోషిస్తూ ఎంబిబిఎస్ త్వరలో పూర్తి చేసి గ్రామంలో ప్రజలకు మరింత సేవ చేయాలని కోరుకుంటూ అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయి అవార్డుకు రవీంద్రప్రసాద్ ఎంపిక

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని గంగన్నగూడెం గ్రామానికి చెందిన సిఆర్‌డిఎ కార్యాలయం డివిజనల్ సర్వే అధికారి సొంగా రవీంద్రప్రసాద్ జాతీయ స్థాయి బంగారు నంది పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గంగన్నగూడెంలో ఆయన సోమవారం మాట్లాడుతూ గౌతమేశ్వర గోసంరక్షణ సమితి విశ్వవిఖ్యాత ఆర్ట్ అండ్ కల్చరల్ అకాడమీ (హైదరాబాద్) త్యాగరాజు గానసభ రక్తదాన సేవా రంగంలో ఇచ్చే జాతీయస్థాయి బంగారు నంది అవార్డుకు తనను ఎంపిక చేశారని తెలిపారు.

'కార్యకర్తలకు అండగా టిడిపి'

ప్రజాశక్తి - కామవరపుకోట

కష్ట సమయంలో కార్యకర్తలు అధైర్యపడొద్దని, పార్టీ అండగా ఉంటుందని చింతలపూడి మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ రామకృష్ణ అన్నారు. ఆడమిల్లిలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్న టిడిపి కార్యకర్త నల్లమిల్లి సత్యనారాయణను మురళీరామకృష్ణ సోమవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఇటీవల అస్వస్థతతో మరణించిన నూతనంకు చెందిన టిడిపి నాయకుడు యలమర్తి రాజా చిత్రపటానికి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. రాజా కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కామవరపుకోట మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ, సర్పంచులు గూడపాటి కేశవరావు, గోరింక దాసు, బిసి సెల్ అధ్యక్షులు జుజ్జురి బాబ్జి, కంటమనేని అంజిమూర్తి, బేతిన వెంకట్రావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జనసైనికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ చెక్కు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జనసేన క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న జనసైనికులు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు చెక్కును జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు సోమవారం అందించారు. నూజివీడు నియోజకవర్గ జనసైనికులు అంకెం రాజేష్, నాయుడు సాయిబాబు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఇరువురు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకోవడంతో వారి కుటుంబ సభ్యులకు సోమవారం మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఇరువురి కుటుంబసభ్యులకు రూ.పది లక్షలు అందించారు. ఈ సందర్భంగా జనసేన నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బర్మా ఫణిబాబు జనసైనికుల కుటుంబాలకు అండగా నిలబడిన డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE ICHAPURAM.
O.S. 10/2016.

Between:
Naidu Tulasi and 2 others. ...Plaintiffs.
And:
Naidu Eswaramma & 8 others. ...Defendants.

NOTICE TO THE RESPONDENT/DEFENDANT No. 8 UNDER ORDER 5 RULE 20 C.P.C.

To,
Defendant No. 8:
Naidu @ Regu Revathi Madhuri, W/o Regu Venkata Ravi Kumar, D/o Late Naidu Nagaraju, R/o Door No. 13-30, Sanivarampeta, Eluru.

Please take notice that the plaintiff has filed the above suit against you and another for permanent injunction and the same is posted to **31-07-2024** for your appearance **at 10-30 A.M.** in the Hon'ble Court of the Junior Civil Judge, Ichapuram and you are to appear in person or through Advocate, failing which the matter will be decided in your absence.

// BY ORDER //

MONOJ KUMAR SAMONTO
ADVOCATE,
ICHAPURAM, SRIKAKULAM,
CELL.No: 8639689012.

Ichapuram,
Dated: 22-07-2024.